క్లుప్తంగా

జోరుగా ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియ



కవిటి కళాశాలలో అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న సిబ్బంది

కవిటి: మండలంలోని కొత్తపాలెంలో నిర్వహిస్తున్న కేజీబీవీ, రాజపురం ఏపీమోడల్ స్కూల్, కవిటి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీ యెట్ ప్రథమ సంవత్సరంలో చేరే ప్రక్రియ జోరుగా సాగుతోంది. మంగళవారం వరకు జరిగిన ప్రక్రియలో కవిటి ప్రభుత్వ కళాశాలలో 95 మంది, రాజపురం ఏపీమోడల్‌స్కూల్‌లో 20 మంది ఎంపీసీ, బైపీసీ,హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులలో చేరారని ఆయా కళాశాలల వర్గాలు వెల్లడించాయి. కొత్తపాలెం కేజీబీవీలో 40 సీట్లు ఉండగా 35 మందికి ప్రవేశాలు కల్పించామన్నారు.అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు వెల్లడైన తర్వాత కవిటి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మరికొన్ని అడ్మిషన్లు పెరగుతాయనే ఆశాభావంతో కళాశాల సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

టెక్కలి: టెక్కలి మండలం చల్లపేట గ్రామంలోని అభయాంజనేస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ జి.మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. స్థానికులతోపాటు సమీప గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసర సరుకులు అందుకున్నవారితో సేవా సంఘం ప్రతినిధులు

టెక్కలి: టెక్కలి పట్టణానికి చెందిన అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో పలువురు దివ్యాంగులు, నిరుపేదలు, వితంతువులకు నిత్యావసర సరుకులు అందజేశారు. సేవా సంఘం సభ్యులు మంగళవారం నిర్వహించిన 'మార్నింగ్ వాక్ ఫర్ పూర్ పీపుల్' కార్యక్రమంలో భాగంగా పది కుటుంబాలకు ఒక్కొక్కరికీ 25 కిలోల బియ్యం, 20 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్, సభ్యులు ఎస్.సింహాచలం, మున్నా, డి.పూర్ణాచారి, ఎ.వీరభద్రాచారి, యు.గోవింద్, డి.శ్రీను, ఎం.లక్ష్మీనారాయణ ఉన్నారు.

నియోనేటల్ వాహనం పరిశీలన



వాహనంలో సేవలపై ఆరా తీస్తున్న రంగప్రసాద్

టెక్కలి: నవజాత శిశువులకు వైద్య సేవలు అందజేసేందుకు నిర్వహిస్తున్న నియోనేటల్ వాహనం 108పై గ్రామస్థాయిలో విస్తృతమైన అవగాహన కల్పించాలని డివిజన్ పర్యవేక్షకుడు ఎం.రంగప్రసాద్ సిబ్బంది సూచించారు. టెక్కలిలోని నియోనేటల్ వాహనాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనం ద్వారా ఇప్పటి వరకు అందిన సేవలపై ఆరా తీశారు. వాహనంలో మందుల నిల్వలను తెలుసుకున్నారు. నవజాత శిశువులకు వైద్య సేవలు అందజేయడానికి నిర్వహిస్తున్న నియోనేటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

లోకేష్‌ను కలిసిన గౌతు శిరీషా



లోకేష్‌తో కరచలనం చేస్తున్న గౌతు శిరీషా, పక్కనే బెందాళం అశోక్

కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యేగా ఎన్నికైన గౌతు శిరీషా మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, టీడీపీ నాయకుడు నారా లోకేష్‌ను మంగళవారం అమరావతిలో కలిశారు. ఆమెతో పాటు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కుమార్ కూడా ఉన్నారు.

గేటు పడితే అవస్థలే!

- రైల్వే లెవెల్ క్రాసింగ్‌లతో ప్రయాణికులకు ఇబ్బందులు
- కుంటుపడుతున్న అభివృద్ధి



అంపురం-ఘాటీముకుందాపురం మార్గంలో రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద రెండువైపులా వేచి ఉన్న ప్రయాణికులు

కంచిలి: రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల కారణంగా ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రాధాన్యత గల మార్గాల్లో సైతం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడంతో ఆయా ప్రాంతాలు అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయి. కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో వివిధ రూట్లలో ఈ పరిస్థితి కన్పిస్తోంది. రైళ్ల రాకపోకల్లో ఎటువంటి తేడాలున్నా ఈ లెవెల్ క్రాసింగ్‌లను దాటి వెళ్లాల్సిన ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరే సమయంలో జాప్యం వస్తుంది. దీంతో చాలా సందర్భాల్లో బయటి ప్రాంతాల నుంచి వచ్చేవారు ఈ ప్రాంతాల్లో ఉన్న గ్రామాలు, వివిధ కూడళ్లకు వెళ్లాలంటేనే వెనుకడుగు వేయాల్సిన దుస్థితి. ఇచ్ఛాపురం మండలంలో పట్టణం నుంచి రత్తకన్న, కొళిగాం ప్రాంతాలకు వెళ్లాలంటే రైల్వే లెవెల్ క్రాసింగ్ దాటాల్సిందే. ఈ మార్గంలో ఆంధ్రాతోపాటు ఒడిశా సరిహద్దు గ్రామాలు ఉన్నాయి. అలాగే ధనాలమ్మ గుడి నుంచి జగన్నాథపురం తదితర గ్రామాలకు వెళ్లాలంటే అక్కడ ఉండే లెవెల్ క్రాసింగ్ దాటాలి. అటువైపు కూడా ఆంధ్రాతో పాటు, ఒడిశా సరిహద్దు గ్రామాలైన పాత్రపురం, జరడా, జయంతుపురం, సంతోషిపురం గ్రామాలు ఉన్నాయి. కవిటి మండల పరిధిలో పాత కొజ్జిరియా, కరాపాడు, గొర్లెపాడు, బసవకొత్తూరు గ్రామాలకు వెళ్లాలంటే లెవెల్ క్రాసింగ్ దాటాలి. అలాగే కంచిలి మండల పరిధిలో అంపురం-ఘాటీముకుందాపురం మార్గం ఉంది. మండలంలో ప్రాముఖ్యత కలిగిన మార్గంలో కంచిలి మండలానికి చెందిన 12 పంచాయతీలు, సరిహద్దు ఒడిశా గ్రామాలకు ఇదే మార్గంలో వెళ్లాలి. అలాగే జక్కర నుంచి కేసరపడ, అర్జునాపురం, ఎక్కల, బిన్నళ, భిన్నళకొత్తూరు తదితర గ్రామాలకు వెళ్లే మార్గం, సోంపేట నుంచి బూరగాం వెళ్లే మార్గం, లక్కవరం నుంచి జాతీయ రహదారికి వెళ్లేందుకు, బారువ నుంచి కొర్లాం, శాసనాం నుంచి సొండిపూడి రూట్‌లో ఉండే గేటు, పాలవలస గేటు ఇలా ఈ నియోజకవర్గంలో అనేక లెవెల్ క్రాసింగ్‌లు ఉన్నాయి. ఇందులో ముఖ్యమైన రత్తకన్న, అంపురం, బారువ-కొర్లాం, పాలవలస లెవెల్ క్రాసింగ్‌ల వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని ఆయా ప్రాంతాల వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ మార్గాల్లో రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వైపుగా బస్సులు, లారీలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించేటప్పుడు రైళ్ల రాకపోకలు వలన గేట్లు వేసేయడంతో ప్రయాణికులు చేరాల్సిన గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

కుంటుపడుతున్న అభివృద్ధి..

రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల తర్వాత ఉన్న గ్రామాల్లో అభివృద్ధి కూడా కుంటుపడుతోంది. కంచిలి మండల పరిధిలో అంపురం-ఘాటీముకుందాపురం మార్గంలో మఠంసరియాపల్లి గ్రామంలో ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేశారు. కానీ ఈ విద్యాసంస్థలో బయట ప్రాంతాల నుంచి రావాల్సిన ఫ్యాకల్టీ చేరడానికి సంశయించాల్సి వస్తోంది. అంతేకాకుండా మిగతా ప్రభుత్వ సంస్థలు కూడా అభివృద్ధి చెందడానికి వీల్లేకుండా పోతోంది. ఇలాగే ఇచ్ఛాపురం నుంచి రత్తకన్న, కొళిగాం మార్గాలు కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోకపోవడానికి ఇదొక కారణంగా ఆ ప్రాంతీయులు పేర్కొంటున్నారు. వాస్తవానికి రైల్వేశాఖ ఇటువంటి మార్గాల్లో ట్రాఫిక్‌ను బట్టి రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, అండర్‌పాసేజ్‌లు కేటాయించడదానికి ముందుకొస్తోంది. మరి ఈ నియోజకవర్గం పరిధిలో అటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టకపోవడంతో ఎటువంటి ముందడుగు పడటం లేదు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు, రైల్వేశాఖ దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం..



ఎక్కడికి వెళ్లాలన్నా రైల్వే లెవెల్ క్రాసింగ్‌ను దాటాల్సిందే. దీంతో సకాలంలో గమ్యస్థానానికి చేరుకోలేక అవస్థలు పడుతున్నాం. తమ ప్రాంతానికి బంధువులు సైతం రావడానికి ఆసక్తి చూపడం లేదు. సమస్యను పరిష్కరించాలి.

–కొణపల సురేష్, సర్పంచ్, మఠం సరియాపల్లి, కంచిలి మండలం

అభివృద్ధికి అవరోధం..



రైల్వే లెవెల్ క్రాసింగ్‌లు అభివృద్ధికి అవరోధాలుగా తయారయ్యాయి. సమాజం, దేశం ఇంతగా అభివృద్ధి చెందిన తర్వాత కూడా ప్రత్యామ్నాయంగా అక్కడి అవసరాన్ని బట్టి ఫ్లైఓవరు బ్రిడ్జిలు, అండర్ పాసేజ్‌లు నిర్మించడం లేదు. పాలకులు పట్టించుకోకపోవడం దురదృష్టకరం.

–భాస్కర్‌పాఢి, కొల్లూరు ప్రాంత అభివృద్ధి సంఘ ప్రతినిధి, ప్రధానోపాధ్యాయుడు, కంచిలి మండలం

రోడ్డు ప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం



వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులకు సాయాన్ని అందజేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: విజయనగరం జిల్లా గుర్ల మండలం భూపాలపురం గ్రామానికి చెందిన నైదాన వెంకటలక్ష్మి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న పూండికి చెందిన యువతరం సేవా సమితి సభ్యులు ఆమెకు అండగా నిలవాలని భావించారు. 30 వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని ఆమె చికిత్స పొందుతున్న విజయనగరంలోని ఆస్పత్రికి సేవా సమితి ప్రతినిధులు మంగళవారం వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. వెంకటలక్ష్మి ఇటీవల బంధువుల ఇంట్లో శుభ కార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తలకు తీవ్రమైన గాయం కావడంతో పాటు ముఖం నుజ్జు నుజ్జు అయింది. దీంతో ఆపరేషన్‌కు రూ.6 లక్షలు అవసరం కావడంతో నిరుపేదలైన తల్లిదండ్రులు దాతల సహాయం కోరారు. దీంతో పెందుర్తికి చెందిన (వీఐపీ)హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ రూ.5 వేలు అందించగా దానితో కలిపి యువతరం సేవా సమితి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చింత మురళి, సమితి ప్రతినిధులు గొరకల సునీల్, అన్నెపు లక్ష్మణరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం

- జూనియర్ సివిల్ జడ్జి తేజ చక్రవర్తి మల్ల



మాట్లాడుతున్న జడ్జి తేజ చక్రవర్తి మల్ల

టెక్కలి: పర్యావరణ పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్ఆర్ తేజ చక్రవర్తి మల్ల అన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వాహణలో భాగంగా ఘనవ్యర్థాల నిర్వాహణపై స్థానిక పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండేల సుజాత నేతృత్వంలో నిర్వహించిన సదస్సులో జడ్జి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికులతో పాటు ప్రజలు సైతం భాగస్వామ్యం కావాలన్నారు. విచ్చలవిడిగా చెత్తను వేయకుండా వాటిని నిల్వ చేసి పంచాయతీ సిబ్బందికి అందజేయాలన్నారు. అనంతరం వ్యర్థాల నిర్వాహణలో కార్మికులు బాధ్యతగా పనిచేయాలని పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద, ఈఓ బి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

డొంకూరులో వైద్య శిబిరం

సాక్షి ఎఫెక్ట్...



వైద్య సేవల్లో సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: 'డొంకూరు మత్స్యకార గ్రామంలో జ్వరాలు' శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో మంగళవారం వచ్చిన కథనానికి వైద్య సిబ్బంది స్పందించారు. హుటాహుటిన మంగళవారం ఉదయం గ్రామానికి చేరుకొని జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి రక్త పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వరంతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందజేసి, సహాయక చర్యలు చేసినట్లు హెల్త్ అసిస్టెంట్ కె.త్రివిక్రమరావు తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని పంచాయతీ పరిపాలనాధికారులకు సూచించినట్టు చెప్పారు. వైద్య శిబిరంలో ఎంపీహెచ్ఈఓ బి.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ యశోధ, ఏఎన్ఎం గున్నమ్మ, ఆశా కార్యాకర్తలు ఉన్నారు.

ప్రజాసేవలో అధికారులు పునరంకితం కావాలి

- కవిటి ఎంపీపీ కడియాల పద్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కడియాల పద్మ

కవిటి: గడచిన ఐదు సంవత్సరాలుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో చిత్తశుద్ధితో పనిచేసిన అధికార యంత్రాంగం సేవలు ప్రశంసనీయమైనవని ఎంపీపీ కడియాల పద్మ అన్నారు. కొత్తగా కొలువుదీరనున్న ప్రభుత్వంలోనూ మండల ప్రజలకు అదేస్థాయిలో సేవలందించి మనపై వారు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టు కోవాలన్నారు. ఈవోపీఆర్డీ శివాజీ పాణిగ్రాహి ఆధ్వర్యంలో ఎంపీపీ పద్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికల్ని చదివి వినిపించారు. కవిటి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాంజీ మాట్లాడుతూ.. ప్రస్తుతం సీజనల్ జ్వరాలతో ప్లేట్‌లెట్ కౌంట్‌తగ్గి కొంతమంది ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇలాంటి వారికి కవిటి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో సత్వర వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. కపాసుకుద్ధి, బట్టివానిపాలెం, చిన్నకర్రివానిపాలెం గ్రామాలకు చెందిన జ్వరపీడితులు ఇక్కడ వైద్యసేవలు పొందుతున్నట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వ్యవసాయ, ఏఎంసీ, ఆర్టీసీ, అటవీశాఖ, పీఏసీఎస్, ఇరిగేషన్, పశుసంవర్థక, అబ్కారీశాఖల అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. సమావేశంలో ఎంఈవో ధనంజయమజ్జి, ఉద్యానశాఖ అధికారి మాధవీలత, ఏపీఎం కె.గోవిందు, ఏపీవో టి.మోహనరావు, నాలుగు పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటి పరిధి పురుషోత్తపురం వద్ద గల ఆదర్శపాఠశాలలో మిగులు సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.వైకుంఠరావు తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏడో తరగతిలో మిగిలిన ఐదు సీట్లు, 8వ తరగతిలో మిగిలిన రెండు సీట్ల భర్తీ కోసం ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 90322 20333 నంబర్‌ని.. లేదా పాఠశాల పని వేళలో సంప్రదించాలని కోరారు.

స్వేచ్ఛావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కడియాల పద్మ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపాలిటీలోని తొమ్మిది వీధుల్లో అమ్మవారి చల్లదనం కోసం సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా కాళీమాత నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శలను ఏర్పాటు చేశారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణ ఘట్టం

కవిటి: మండలంలోని బొరివంకలో వెలసిన పార్వతి సమేత శ్రీరామలింగేశ్వర ఆలయంలో మంగళవారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి శీతల షష్టి తొమ్మిది రోజుల ఉత్సవాల ప్రారంభం సందర్భంగా గ్రామానికి చెందిన కొత్తపల్లి రంగారావు ఆచారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. తొమ్మిది రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదట రోజు శివపార్వతుల కల్యాణంతో ప్రారంభమవుతుందని అనంతరం గ్రామంలోని పురవీధుల్లో స్వామివారిని తిరువీధి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు.

పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కొత్తపల్లిలో పశువులపై అవగాహన కల్పిస్తున్న ఏడీ లోకనాథం

కోటబొమ్మాళి: పశువ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని కోటబొమ్మాళి వెటర్నరీ ఏడీ మంద లోకనాథం అన్నారు. కురుడు, కొత్తపల్లి గ్రామాల్లో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసే ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో పశువులకు జబ్బువాపు, మేకలు, గొర్రెలకు చిటుకవ్యాధి సక్రమించే అవకాశం ఉందన్నారు. వీటి నివారణకు ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. కురుడు పశు వైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్, వెటర్నరీ సహాయకులు కె.ముకుందరావు, ఎస్.శాంతారావు, కె.ధర్మారావు ఉన్నారు.

బ్యాంక్ మేనేజర్ బాధ్యతల స్వీకరణ



ప్రవీణ్‌కుమార్

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌గా వి.ప్రవీణ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కుసిమిలో పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ మేనేజర్ కుసిమి బ్రాంచికి బదిలీపై వెళ్లారు. బ్యాంకు ఖాతాదారులకు, రైతులకు, డ్వాక్రా మహిళల అభివృద్ధికి తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తున్నామని.. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నూతన బీఎం ప్రవీణ్ కుమార్ కోరారు.

అమరావతికి తరలిన కూటమి శ్రేణులు



పలాస నుంచి వెళ్తున్న కూటమి శ్రేణులు

కాశీబుగ్గ: అమరావతిలో బుధవారం జరగనున్న ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు పలాస మండలం, మున్సిపాలిటీ, మందస మండలాలకు చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన అభిమానులు మంగళవారం సాయంత్రం ప్రత్యేక బస్సులో బయలుదేరి వెళ్లారు. పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదిరి ఆధ్వర్యంలో వీరంతా వెళ్లారు.

మృతుని కుటుంబానికి అండగా..



శరణ్యకు సాయాన్ని అందిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: బ్రాహ్మణతర్లా గ్రామం కొండివీధి గ్రామానికి చెందిన బడే రమేష్ ఇటీవల ఆకస్మికంగా మరణించారు. దీంతో అతని కుటుంబానికి ఇదే గ్రామానికి చెందిన వారియర్స్ ప్రతినిధులు అండగా నిలిచారు. 10,500 రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని రమేష్ పెద్దామ్మాయి శరణ్యకు మంగళవారం అందజేశారు. చదువు కోవడానికి కావాల్సిన వనరులను సమకూరుస్తామని భరోసా ఇచ్చారు.

పచ్చిరొట్ట విత్తనాల కోసం పేర్ల నమోదు

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో నిర్ణీత ధరలు చెల్లించి పేర్లను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.కిరణ్‌వాణి కోరారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు వేసుకుని దమ్ము చేసుకుంటే భూమి సారంతో పాటు సత్తువ కలుగుతుందన్నారు. తద్వారా అధిక దగుబడులు సాధించవచ్చునని సూచించారు. జీలుగు 6.5 క్వింటాళ్లు, కట్టిజనుము 1.70 క్వింటాళ్లకు ప్రతిపాదనలు పెట్టామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఆధార్ కార్డుతో ఆర్‌బీకేలను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. జీలుగు, కట్టిజనుము విత్తనాలు రూ.10 కిలోలు రూ.440 ధరలతో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇదికాక ఖరీఫ్ వరి విత్తనాలు స్వర్ణ, సాంబ, 1061, 1064, మార్టేరు సాంబ, సోనామసూరి తదితర రకాలు మండలానికి 750 క్వింటాళ్లను ప్రభుత్వం కేటాయించినట్టు పేర్కొన్నారు.

ముగిసిన గ్రామ దేవత ఉత్సవాలు



నల్లబొడ్లూరులో అమ్మవారి ఊరేగింపు

కాశీబుగ్గ: మందస మండలం నల్లబొడ్లూరు గ్రామంలో మంగళవారం సందేశ్వరి అమ్మవారి సిరుమానోత్సవం ఘనంగా ముగిసింది. వలస కార్మికులు, ఉద్యోగులు గ్రామానికి చేరుకుని వివిధ రకాల వేషధారణలో ఆకట్టుకున్నారు. అలాగే పలాస మండలం తర్లాకోట పంచాయతీ ఖైజోల గ్రామంలో మూడు రోజులు జరిగిన సీతమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాలు కూడా ఘనంగా మంగళవారంతో ముగిశాయి.

దివ్యాంగుడికి ఆర్థిక సాయం



సాయాన్ని అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం గ్రామానికి చెందిన గాలి కృష్ణారావు రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లను పోగొట్టుకొని మంచానికే పరిమితమయ్యాడు. దీంతో అతని కుటుంబం ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటుంది. ఈ విషయం తెలుసుకున్న ఈదుపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1999 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకువచ్చారు. ఏడు వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని కృష్ణారావుకు మంగళవారం అందించారు.